క్లుప్తంగా

వాహనదారులు భద్రతా ప్రమాణాలు పాటించాలి

పాచిపెంట: వాహనదారులు భద్రతా ప్రమాణాలు పాటించాలని రూరల్ సీఐ రామకృష్ణ అన్నారు. ఈ మేరకు మండలంలోని పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద ఆదివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ వాహన రికార్డులను తప్పక కలిగి ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఈ సందర్భంగా సీఐ కోరారు. ద్విచక్రవాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, ప్రమాదాల నుంచి రక్షణకు అది ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. కార్యక్రమంలో ఎస్సై వెంకటసురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

సువర్ణముఖి పరీవాహక ప్రజలు జాగ్రత్తలు పాటించాలి



తహసీల్దార్ బి. ప్రసన్నకుమార్

సీతానగరం: ఆంధ్రా, ఒడిశా ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా ఆయాప్రాంతాలకు అనుసంధానంగా ఉన్న సువర్ణముఖి నదిలో నీరు ఉధృతంగా ప్రవహిస్తున్నందున నది పరీవాహక ప్రాంతాల ప్రజలు రాకపోకల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ బి.ప్రసన్నకుమార్ అన్నారు. నదిలో నీరు ఉధృతంగా ప్రవహిస్తున్న కారణంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ కొత్తవలస నుంచి పెదంకలాం వరకూ ఉన్న పది గ్రామాల ప్రజలు పొలం పనుల నిమిత్తం, నిత్యావసర సరుకుల కొనుగోలు నిమిత్తం, పశువుల మేతకు తరలింపు నిమిత్తం రాకపోకలు చేస్తుంటారన్నారు. నదిలో నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ప్రమాదం సంభవించే ఆస్కారం ఉందని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరారు. వాతావరణం అనుకూలించేంత వరకూ నదిలోంచి రాక పోకలు నిర్వహించరాదని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌డీటీ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

సారారహిత మండలాలుగా మక్కువ, పాచిపెంట



ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ దాసు

సాలూరు: పాచిపెంట, మక్కువ మండలాలను సారారహిత మండలాలుగా ప్రకటించినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ దాసు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ, పాచిపెంట మండలంలో 10 గ్రామాలు, మక్కువ మండలంలో 12 గ్రామాలు సారా ప్రభావిత గ్రామాలుగా గుర్తించామన్నారు.అక్కడ గ్రామస్థాయిలో కమిటీలు వేసి సారారహిత గ్రామాలుగా తీర్చిద్దామని పేర్కొన్నారు. నవోదయంలో భాగంగా నూతన, పాతసారాకేసుల్లో 88 మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. 216 లీటర్లు సారా, 4800 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశామని, రెండు ద్విచక్రవాహనాలు సీజ్‌చేశామని చెప్పారు. 152 మందిపై బైండోవర్‌కేసులు పెట్టామన్నారు. సారామహమ్మారి నివారణకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ మేరకు గ్రామాల్లో ప్రచార రథాలు,అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.

గోగు పంట సాగుపై అనాసక్తి



గరుగుబిల్లిలో సాగు చేస్తున్న గోగు పంట

గరుగుబిల్లి: గోగు(గోగునార) పంట సాగుపై రైతు లు అంతగా ఆసక్తి చూపడం లేదు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయింది. సకాలంలో విత్తనాలు సరఫరా చేయకపోవడం, సాగుకు ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రోత్సాహం లేకపోవడంతోనే రైతులెవరూ గోగు సాగుకు మక్కు వ కనబరచడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. అలాగే ప్రస్తుతం పంటకు తగిన గిట్టుబాటు ధర కూడా లేదని, కూలీల రేట్లు, పెట్టుబడి అధికంగా ఉంటోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ఉల్లిబద్ర, దళాయివలస, పెద్దూరు, గరుగుబిల్లి, గొట్టివలస, గొల్లవానివలస, ఉద్దవోలు తదితర గ్రామాల్లో 1150 ఎకరాల్లో గోగు పంట సా గు జరగనున్నట్లు వ్యవసాయాధికారులు తొలుత అంచనా వేయగా ఇప్పుడు కేవలం 500 ఎకరాల్లోనే గోగు సాగు జరుగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం ఆదరించి, ప్రోత్సహిస్తేనే గోగు సాగు మళ్లీ ఊపందుకుంటుందని రైతులు అంటున్నారు.

హైకోర్టు జడ్జికి సన్మానం



తుహీన్‌కుమార్‌ను సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

పాలకొండ: హైకోర్టు జడ్జిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన తుహిన్‌కుమార్‌ను స్థానిక బార్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం ఘనంగా సన్మానించారు. వీరఘట్టం మండలం కత్తులకవిటి గ్రామానికి చెంది న తుహిన్‌కుమార్ హైకోర్టు జడ్జిగా నియమితులు కావడం ఈ ప్రాంతానికి చెందిన గర్వకారణమని న్యాయవాదులు కొనియాడారు. కార్యక్రమంలో స్థానిక జూనియర్ సివిల్ జడ్జి చందక హరిప్రియ, సీనియర్ న్యాయవాదులు ఉత్తరావల్లి మురళీమోహన్, చందక జగదీష్‌కుమార్, కనపాక సూర్యప్రకాశరావు, తిర్లంగి ఉపేంద్రకుమార్, కర్రా రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత బస్సే కానీ.. ఉన్న బస్సు తుస్..!



గోతులతో దర్శనమిస్తున్న సాలూరు-మక్కువ రోడ్డు

- సాలూరు–మక్కువ–దుగ్గేరు సర్వీసు నిలుపుదల

సాలూరు: స్త్రీశక్తి కింద మహిళలకు పరిమిత కేటగిరి బస్సుల్లో ఉచిత బస్సు సర్వీసులను ఈ ప్రభుత్వం ప్రారంభించింది. అయితే ఇదే సమయంలో తమ గ్రామాలకు వెళ్లే బస్సు సర్వీసును నిలిపివేయడంతో బాగువలస మీదుగా సాలూరు–మక్కువ బస్సు సర్వీసు నడిచే గ్రామాల ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బస్సు సర్వీసు నిలుపుదల

సాలూరు–మక్కువ రోడ్డు గుంతలతో అధ్వానంగా మారింది. దీంతో ఈ మార్గంగుండా ప్రయాణం నరకంగా మారింది. గుంతలతో నిండిన మార్గంలో బస్సు సర్వీసు నడపడం కష్టంగా మారిందని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. దీంతో ఏకంగా ఈ మార్గం గుండా బస్సు సర్వీసును గురువారం నుంచి నిలిపివేశారు.

గజానికో గొయ్యి

గుంతలతో నిండిన ఈ రోడ్డు గుండా ప్రయాణిస్తూ, పలు లారీలు మరమ్మతుల బారిన పడిన సంఘటనలు ఉన్నాయి. గజానికో గొయ్యి పైగా అందులో వర్షపు నీరు నిలిచిపోవడంతో గొయ్యి లోతు అంచనా వేయలేక పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో ఈ ప్రాంతాల గుండా ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.అవకాశం ఉన్న వారు వీలైనంత మేర ఈ రోడ్డు గుండా రాకపోకలను ఆపేసి , సాలూరు నుంచి మామిడిపల్లి, శంబర మీదుగా మక్కువకు రాకపోకలు సాగిస్తున్న పరిస్థితులున్నాయి.



గోతులలో నిండిన నీటితో సాలూరు-మక్కువ రోడ్డు

విద్యార్థులు, ఉద్యోగుల పరిస్థితేంటి?

ఈ రోడ్డు అధ్వానంగా ఉండడంతో బస్సు సర్వీసును నిలుపుదల చేశారు. రోడ్డు బాగాలేకపోవడంతో ఇప్పటికే ఈ రోడ్డు గుండా ఆటోల ప్రయాణాలు చాలా పరిమితమైపోయాయి. ఉన్న బస్సు సర్వీసును నిలుపుదల చేయడంతో ఈ మార్గాల్లో ఉన్న అనేక గ్రామాల విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజల కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి.

కూటమి పాలనలో రోడ్డు నిర్మాణానికి కలగని మోక్షం

ఎన్నికల్లో, ఎన్నికల తరువాత పలుమార్లు మంత్రి సంధ్యారాణి ఈ సాలూరు –మక్కువ రోడ్డు నిర్మాణం పూర్తిచేయిస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఈ రోడ్డు నిర్మాణానికి అడుగులు పడిన పరిస్థితి లేకుండా పోయింది.పైగా కురుస్తున్న వర్షాల వల్ల ఈ రోడ్డు మరింత అధ్వానంగా మారి ప్రయాణికులకు ఈ రోడ్డుపై ప్రయాణం నరక యాతన తలపిస్తోంది. ఇకనైనా పాలకులు స్పందించి ఇచ్చిన హామీ మేరకు సాలూరు–మక్కువ రోడ్డు నిర్మాణం పూర్తిచేయించాలని ప్రజలు కోరుతున్నారు.

రాజన్నదొర చొరవతో ప్రారంభమైన రోడ్డు పనులు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాటి ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర ప్రత్యేక కృషితో సాలూరు నుంచి మక్కువ వరకు 19.60 కి.మీ రోడ్డు వెడల్పు, పటిష్ట పరిచేందుకు సుమారు రూ.55 కోట్ల 56 లక్షల అంచనా విలువతో ఈ రోడ్డు మంజూరైంది. రూ.38 కోట్ల 52 లక్షల పని విలువతో ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో 2021 మార్చి 1వ తేదీన ఈ రోడ్డు పనులు ప్రారంభించారు. పనుల్లో భాగంగా 6 కి.మీ మెటల్ లేయర్ వేశారు. 32 కల్వర్టులకు గాను 16 కల్వర్టులు, 8 మైనర్ బ్రిడ్జిలకు గాను 3 బ్రిడ్జిల నిర్మాణం పూర్తయింది. మిగిలిన పనులు చేపట్టాల్సి ఉండగా కూటమి ప్రభుత్వం కొలువుదీరాక పట్టించుకోవడం మానేసింది.

మక్కువ-దుగ్గేరు బస్సు సర్వీసు నిలిపివేశాం

సాలూరు నుంచి బాగువలస మీదుగా మక్కువ –దుగ్గేరు బస్సు సర్వీసు నిలిపివేశాం. ఈ రోడ్డంత బాగాలేని కారణంగా సాలూరు నుంచి మామిడిపల్లి, శంబర మీదుగా మక్కువ, దుగ్గేరుకు బస్సు నడుపుతున్నాం.

మూర్తి, డిపో మేనేజర్, సాలూరు

ప్రమాదకరంగా పెదంకలాం డ్యామ్

- ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు

సీతానగరం: మండలంలోని సువర్ణముఖి నదిపై ఉన్న పెదంకలాం డ్యామ్ వద్ద ప్రమాదకరంగా గోతులు వారినా పట్టించుకునే వారు కరువయ్యారని, గోతుల్లో ఎప్పుడు ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. చినంకలాం–పెదంకలాం గ్రామాల మధ్య సువర్ణముఖి నదిపై ఉన్న డ్యామ్ ద్వారా నీరు నిల్వ ఉంచి 8 వేల ఎకరాల భూమికి సాగునీరందించే విధంగా అప్పట్లో పనులు జరిగాయి.ఈ మేరకు వేలాది ఎకరాలకు సాగునీరందించాల్సిన డ్యామ్ వద్ద అభివృద్ధి పనులు చేపట్టక పోవడంతో ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ముందుగా ఉన్న గోతులు పెద్దవి కావడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నా పట్టించు కోలేదని ఆరోపిస్తున్నారు. కాలువలకు మరమ్మతులు చేయక, డ్యామ్ వద్ద అభివృద్ధి పనులు చేపట్టక, సాగునీరందించక రైతులు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకున్న దాఖలాలు లేవని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి డ్యామ్‌వద్ద ఏర్పడిన గోతులు పూడ్చాలని, నదిలో ఉన్న షట్టర్లకు మరమ్మతులు చేపట్టి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



షట్టర్ల మీదుగా వృథాగా దిగువకు ప్రవహిస్తున్న నీరు

ద్విచక్ర వాహన చోదకులు విధిగా హెల్మెట్ ధరించాలి



మాట్లాడుతున్న ఎస్సై ఎం.రాజేష్

సీతానగరం: మండలంలో ద్విచక్రవాహనాలతో ప్రయాణం చేస్తున్నవారు విధిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై ఎం.రాజేష్ అన్నారు. వాహనాల తనిఖీల్లో భాగంగా ఆదివారం లచ్చయ్యపేటలో రాష్ట్రీయ రహదారిపై సిబ్బందితో పాటు ఎస్సై ఎం .రాజేష్ వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమదాలు సంభవించే సమయాల్లో ఎక్కువ మంది ద్విచక్రవాహనాలపై వెళ్తున్న వారు ప్రమాదాలకు గురై తలకు బలమైన గాయాలతో ఆస్పత్రుల్లో చేర్చడం, రక్తం కోల్పోవడంతో ప్రాణాపాయ పరిస్థితుల్లో ఉంటున్నారన్నారు. తలకు గాయాలు తగలకుండా ఉండేందుకు హెల్మెట్ దోహద పడుతుందని ద్విచక్రవాహనం నడిపే వారితో పాటు, వెనుక ఉన్న ప్రయాణికుడు విధిగా హెల్మెట్ ధరించాలని ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేయడంతో అమలు చేయాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. ఈ మేరకు వాహనాలు తనిఖీ చేస్తూ హెల్మెట్ ధరించని వారి నుంచి అపరాధ రుసుం విధించనున్నామని ఈ విషయమై వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలియజేశారు.

బైపాస్ రోడ్డుపై నిలిచిన మురుగు

పాచిపెంట: మండల కేంద్రంలోని తులసినాయుడు వీధి సమీపంలో బైపాస్ రోడ్డుపైన మురుగునీరు నిలిచిపోయింది. రోడ్డు కింద ఉన్న మురుగునీరు వెళ్లే కాలువలో వ్యర్థాలు పేరుకుపోవడంతో ఊరి చెరువులోకి వెళ్లవలసిన మురుగునీరు అంతా రోడ్డుపైనే ప్రవహిస్తోంది. దీనివల్ల దుర్వాసన రావడంతో సమీప ఇళ్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అసలే వర్షాకాలం కావడంతో మురుగునీటిలో దోమలు వృద్ధి చెంది మలేరియా, డయేరియా వంటి సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా అటుగా ప్రయాణించే వాహన చోదకులు కూడా మురుగునీరు గుండా ప్రయాణం చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి మురుగునీటిని తరలించే ప్రయత్నం చేయాలని కోరుతున్నారు.



బైపాస్‌రోడ్డు మీద పేరుకుపోయిన మురుగునీరు

దివ్యాంగుల పెన్షన్లు తక్షణమే పునరుద్ధరించాలి

- నేడు సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరసన
- పార్టీ జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు

పార్వతీపురంటౌన్: జిల్లాలో వివిధ కారణాలను సాకుగా చూపించి సుమారు 2 వేల మంది దివ్యాంగుల పెన్షన్లను రద్దు చేసేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టడం సరైన విధానం కాదని సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు మండిపడ్డారు. ఈ మేరకు ఆదివారం ఆయన పార్వతీపురంలోని సుందరయ్య భవనంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఆర్భాటంగా హామీల వర్షం కురిపించిన కూటమి నేతలు ఇప్పుడు పెన్షన్లు, ఇతర సంక్షేమ పథకాలను కుదించేందుకు కుట్రలు చేస్తున్నారని, ఇది అత్యంత దుర్మార్గమైన చర్యఅని విమర్శించారు. తల్లికి వందనం, రైతుభరోసా, దివ్యాంగుల పెన్షన్లు వంటి పథకాలలో అనర్హుల పేరిట నిజమైన అర్హత కలిగి, అనేక సంవత్సరాలుగా లబ్ధి పొందుతున్న వారిని కూడా సంక్షేమ పథకాలకు దూరం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హత కలిగిన దివ్యాంగుల పెన్షన్లను రద్దు చేసే ఆలోచన మానుకోకపోతే సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున లబ్ధిదారులతో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు

నేడు కలెక్టరేట్ వద్ద నిరసన..

కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన తెలియజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులంతా పాల్గొవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు వి.ఇందిర, జిల్లా కమిటీ సభ్యులు రెడ్డి వేణు, బీవీ రమణ, గొర్లి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

11వ మన్యం జిల్లా మహాసభలు విజయవంతం చేయండి



మహాసభల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

సాలూరు: పార్వతీపురం మన్యం జిల్లాలో జరగనున్న 11వ మన్యం జిల్లా మహాసభలు విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్‌వైనాయుడు, ఇతర పార్టీ నాయకులు కోరారు.ఈమేరకు ఆదివారం మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మూసివేసిన జీగిరాం జ్యూట్‌ఫ్యాక్టరీని తెరిపించడంలో పాలకులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారన్నారు. జిల్లాలో, నియోజకవర్గ కేంద్రాల్లో ఈఎస్ఐ ఆస్పత్రులు అందుబాటులోకి తీసుకువచ్చి కార్మికులకు వైద్యసేవలు అందించాలని డిమాండ్ చేశారు.జిల్లాలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను నిర్దాక్షిణ్యంగా తొలగిస్తున్నారని, మక్కువ, కరాసవలస కేజీబీవీల్లో ఈ విధంగా చేశారని ఈ పద్ధతి సరైంది కాదన్నారు. రానున్న కాలంలో పాలకొండలో సీఐటీయూ మహాసభలు జరగనున్నాయని వాటిని జయప్రదం చేయాలని కోరారు.

నేత్ర శస్త్రచికిత్సకు 51 మంది ఎంపిక

జియ్యమ్మవలస: మండలంలోని పెదమేరంగి కూడలిలో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి, విశాఖపట్నం సహకారంతో జరిగిన ఈ శిబిరానికి మొత్తం 107 మంది కంటి రోగులు హాజరుకాగా వారి కళ్లను వైద్యులు తనిఖీలు చేశారు. వివిధ కంటి సమస్యలతో బాధపడుతున్న 51 మందిని శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు. వీరికి శంకర్ ఫౌండేషన్ ద్వారా ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయనున్నట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు సాయికుమార్ తెలిపారు.

అధ్వానంగా బైపాస్ రోడ్డు



బైపాస్ రహదారిపై గోతుల వద్ద నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

పార్వతీపురం టౌన్: పట్టణంలోని బైపాస్ రోడ్డు దుస్థితి చాలా దారుణంగా ఉందని కాంగ్రెస్ పార్టీ నాయకుడు, పార్టీ ఓబీసీ జిల్లా చైర్మన్ వంగల దాలినాయుడు మండిపడ్డారు. ఈ మేరకు ఆదివారం బైపాస్ రోడ్డులో ఏర్పడిన పెద్ద పెద్ద గోతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్ల విషయంలో కూటమి పాలకులు విఫలమయ్యారని ఆరోపించారు. కూటమి పాలనలో బైపాస్ రోడ్డుపై ఓ వైపు ప్రయాణాలు ఆగిపోయాయన్నారు. సంక్రాంతికి రోడ్లన్నీ పూర్తి చేస్తామన్న పాలకుల హామీలు వినాయక చవితి వస్తున్నా కానరావడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎక్కడైనా అభివృద్ధి ముందుకు వెళ్తుంది కానీ పార్వతీపురంలో మాత్రం అభివృద్ధి వెనుకకు వెళ్తోందన్నారు. బైపాస్ రోడ్డులో ఏర్పడిన పెద్ద పెద్ద గోతుల వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బైపాస్ రోడ్‌లోని గోతుల్లో పడి ప్రయాణికులు మృత్యువాత పడక ముందే చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ కోలా కిరణ్ కుమార్, మండల అధ్యక్షుడు తీళ్ల గౌరీ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం సమంజసం కాదు



సమావేశంలో సమస్యలపై మాట్లాడుతున్న అర్చకులు

- ధూపదీప, నైవేద్య అర్చకుల సంఘం

పార్వతీపురం రూరల్: తమకు ప్రభుత్వం ఇస్తున్న రూ.7వేల వేతనాన్ని రూ.18వేలకు పెంచి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేసేలా చేయాలని ధూప దీప, నైవేద్య అర్చకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని అడ్డాపుశీల కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో అర్చకుల సంక్షేమసంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారి సమస్యలను సంబంధిత అధికారులకు వినతిపత్రాల ద్వారా తెలియజేసేందుకు కార్యాచరణ చేశారు. ప్రతి దేవాలయానికి మూల స్తంభంగా ఉన్న అర్చకులను కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా చూడడం సమంజసం కాదని మండిపడ్డారు. ప్రభుత్వ ఉద్యోగులుగా తమను ఎలా గుర్తించి పథకాలు అమలు కాకుండా చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో శ్రీనివాసపాఢి, లింగరాజు రాథోడ్, వేణుగోపాల శర్మ, జిల్లా పరిధిలో ఉన్న పలువురు అర్చకులు పాల్గొన్నారు.

నాగావళిలో పెరిగిన నీటి ఉధృతి



ఉధృతంగా ప్రవహిస్తున్న నాగావళి నది

పాలకొండ రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గడిచిన రెండు రోజులుగా వర్షాలు కొనసాగుతున్నాయి. ఆదివారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వరుణుడు తన ప్రతాపం చూపాడు. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు స్థానిక వర్ష ప్రభావంతో నాగావళి నదీ తీరంలో వరద ఉధృతి ఊపందుకుంది. దీంతో తీరప్రాంత గ్రామాలైన అన్నవరం, అంపిలి, గోపాలపురంతో పాటు చిన్న, గొట్ట మంగళాపురాలు, ఎరకారాయపురం, తదితర ప్రాంత వాసులు ఆందోళన చెందుతున్నారు. దాదాపు 400 ఎకరాల్లో వరి, చెరకు మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని తీరప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరో రెండు రోజులు వర్షాలు పడితే ఖరీఫ్ సీజన్‌పై ఆశ వదులుకోవాలని చెబుతున్నారు. ఇదిలా ఉంటే వర్ష ప్రభావంతో తహసీల్దార్ రాధాకృష్ణ నేతృత్వంలో ఎస్సై ప్రయోగ మూర్తితో కూడిన బృందం తీర ప్రాంతాలలో పర్యటించింది. నదీ స్నానాలకు, ఇతర అవసరాలకు నదిలో దిగవద్దని హెచ్చరికలు జారీ చేశారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని తీరప్రాంత గ్రామాల్లో దండోరా వేయించారు.

అధ్వాన రహదారులతో తప్పని తిప్పలు



లక్ష్మీనారాయణపురం గ్రామానికి వెళ్లేందుకు ఉన్న రహదారిపై ఏర్పడిన గుంతలు

పార్వతీపురం రూరల్: గ్రామీణ ప్రాంతాలకు వెళ్లేందుకు ఉన్న రహదారులు అడుక్కోగొయ్యి, మలుపుకో గుంతతో రాళ్లు తేలి అధ్వానంగా ఉన్నాయి. నిత్యం పట్టణ ప్రాంతాలకు గ్రామీణ ప్రాంతాలనుంచి రాకపోకలు సాగించే ఉద్యోగులు, విద్యార్థులు రోడ్ల అధ్వానంగా ఉండడంతో అవస్థలు పడుతూ ప్రమాదాల బారిన పడి గాయాల పాలవుతున్నారు. పార్వతీపురం మండలంలోని లక్ష్మీనారాయణపురం, చొక్కాపువానివలస, చినబొండపల్లి, ఎమ్మార్‌నగరం, వెంకంపేట, పులిగుమ్మి తదితర గ్రామాల రహదారులు వాటి రూపాలు మార్చుకుని ఎత్తు, పల్లాలతో శిథిలావస్థకు చేరి వాహన చోదకుల అవస్థలకు నిలయాలుగా మారాయి.



అధ్వానంగా గుంతలతో ఉన్న చొక్కాపువానివలస రహదారి

తోణాంలో దుకాణాల తనిఖీ

సాలూరు: మండలంలోని తోణాం గ్రామంలో కిరాణాషాపులను తనిఖీ చేసినట్లు రూరల్ ఎస్సై నర్సింహమూర్తి తెలిపారు.
ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ, తోణాంలో తనిఖీలు నిర్వహించగా అక్కడి 6 దుకాణాల్లో కాలం చెల్లిన కూల్‌డ్రింకులు, బిస్కెట్‌ప్యాకెట్లను గుర్తించి సీజ్‌చేశామన్నారు.ఆ దుకాణాల యజమానులపై ఫుడ్‌సేఫ్టీ యాక్ట్ కింద కేసు నమోదుచేస్తున్నట్లు తెలిపారు.